



# ఏక్షన్ అండ్ రియాక్షన్

కొత్త శ్రీనివాసరావు

రాధ భర్త మోహన్ రాక కోసం ఎదురు చూడసాగింది. రాత్రి ఎనిమిదిగంటలైనా మోహన్ ఇంకా ఇంటికిరాకపోయేసరికి విసుగుతో విసురుగా గేటు తలుపులు మూసి ఇంటిలోపలికివచ్చింది.

అత్తగారు, మామగారు జ్యోతి హాలులో కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు. రాధరాక గమనించి మోహన్ తండ్రి రాఘవయ్యగారు రాధనుద్దేశించి "ఏమ్మా? అబ్బాయి ఇంకా ఇంటికిరాలేదా?" అని ప్రశ్నించారు.

"రాలేదండి. స్నేహితులతో సినిమాకేమన్నా వెళ్ళారేమో" అని సమాధానం చెప్పింది రాధ.

అక్కడ నిలబడితే ఇంకేం ప్రశ్నలెదురవుతాయో నసే భయంతో తనగదిలోకి వెళ్ళిపోయింది.

హాలులో రాఘవయ్యగారంటున్న మాటలు గదిలో రాధకి వినపడుతూనేవున్నాయ్. ఆయన 'ఏమిటి? వీడిలా తయారయ్యాడు రాధకు వీడికి మనస్పర్థలేమన్నా వచ్చాయా? రోజూ సరిగా ఇంటికే రావటం లేదు. వీడి ప్రవర్తన చూస్తుంటే నాకేదో అనుమానంగా వుంది. రానియ్. ఏమిటో కనుక్కుందాం" అని అంటున్నారు.

అత్తగారు ఏమిటో అంటున్నారు. కాని రాధ ఆలోచనలో మునిగిపోయింది. 'కనుక్కోవటానికి ఏంలేదని తెలియదు వీళ్ళకి చెప్పినా నమ్మరు' అనుకొని మళ్ళీ వెంటనే 'నిజమే. ఈయనీమధ్య పూర్తిగా మారిపోయారు. మరీ నెలరోజుల్నుండి ఇంటిపట్టునే వుండటంలేదు. ఎప్పుడో ఒకపూట భోజనానికొస్తారు. చేసి చెయ్యకుండా కొక్కాగానే మళ్ళీ వెళ్ళిపోతున్నారు. కాలేజీకికూడ సరిగా వెళ్ళటం లేదని తెలిసింది. ఈయన క్లాసులు తీసుకోకపోయేసరికి విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేశారట. కాలేజీలోను ఇంటిలోనువుండక ఎక్కడుంటున్నారు. ఈయనిలా మారిపోవటానికి కారణమేమిటి? దీనికి తనెంతవరకు బాధ్యురాలు? ఇప్పుడు కూడ తనమీద కోపమేం లేదు' ఇలా ఆలోచిస్తున్న రాధ గేటు చప్పుడయేసరికి పులిక్కిపడి లేచింది

గేటు తలుపు తీసేసరికి వాసన గుప్పుమంది. ఆశ్చర్యపోయింది రాధ.

మోహన్... ఇలా వున్నాడేమిటి?

బట్టలన్నీ నలిగిపోయినయ్. తలంతా చెదరిపోయింది. కళ్ళల్లో ఎర్రగా జీరలు కనబడుతూనే వున్నాయ్ మెడలో మఫ్లర్ నిండా నల్లటి మరకలు.

మనిషి తూలిపోతున్నాడు ఏదో గొణుగుతూలోపలికడుగెట్టబోయి గుమ్మం తగిలి పడిపోబోయాడు. మోహన్, గబుక్కున వంగి భర్తను పట్టుకొంది రాధ. భర్త నడుముచుట్టు చెయ్యి పెనవేసి భర్త చేతిని తన భుజంపై వేసుకొంది.

భర్త తప్పటడుగులకు తప్పటడుగులు వేస్తూ రాధ భర్తను గదిలోపలికి తీసుకొచ్చింది. ఇంట్లో అందరూ నిద్రపోబట్టి అల్లరవలేదు.

మోహన్‌ను మంచంమీద పడుకోబెట్టివంటింట్లోకెళ్ళి మజ్జిగ తీసుకొచ్చింది. బూట్లతోనే నిద్రపోతున్న మోహన్‌ను "ఏమండీ కొద్దిగా ఇవి తాగండి" అంటూ భుజం కుదిపింది

సమాధానమేం లేకపోయేసరికి తలను అటుఇటు వూపింది. నెమ్మదిగా కళ్ళు విప్పాడు మోహన్. ఆ కళ్ళను చూడగానే రాధకు భయమేసింది. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్. గద్గద కంఠంతో 'పాలు త్రాగండి' అని అబద్ధమాడి మోహన్ చేత మజ్జిగ త్రాగించింది. తలక్రింద దిళ్ళు సర్ది పెట్టింది. తడి గుడ్డతో ముఖమంతా తుడిచి, మెడ వరకు దుప్పటి కప్పింది

కంటి నీటిని కొంగుకొసతో తుడుచుకొంటూ ఎదురుకుర్చీలో కూర్చుంది. ఆలోచనలు మెదడును చుట్టుముట్టాయ్. "ఈయన తాగుడు అలవాటు చేసుకొన్నారు. ఈయన చేత ఈ అలవాటునెలా మాన్పించాలి? అత్తగార్కి, మామగారికి తెలియపరిస్తే... లాభంలేదు. వాళ్ళు చెప్పిన మాటలు ఈయన లెక్కచేస్తారన్న నమ్మకంలేదు. ఏదో విధంగా తనే ఈ సమస్యను పరిష్కరించుకోవాలి. తన సంసారాన్ని తనే నిలుపుకోవాలి. పదిమందికి చెప్పుకుని అపహాస్యం పాలయ్యేకంటే ఇంత చదువుకున్న తనే ఈయన చేత తాగుడు మాన్పించాలి." ఇలా ఆలోచిస్తూ నిద్రలో కొరిగిపోయింది రాధ.

* * *

మరో పదిరోజులు గడిచిపోయాయి, మోహన్ ఇప్పుడు ఎప్పుడూ ఇంట్లోనే వుంటున్నాడు. ఎవ్వరితోను మాట్లాడడు. ఇదివరకు ఆ తాగుడు వ్యవహారం బయట చూచుకొనేవాడు. ఇప్పుడు ఇంట్లోనే అందరి ఎదుట బాటిల్స్‌పైన బాటిల్స్ ఖాళీ చేస్తున్నాడు. ఖాళీ బాటిల్స్ అన్నీ అటకమీదికి చేరిపోతున్నాయ్. వాటిని చూసి గుండెలు బేజారెత్తిపోతున్నాయి రాధకు, జ్యోతికి. ఇదివరకు విద్యార్థులలో మంచిపేరు సంపాదించుకొన్న మోహన్‌కు దేవదాసు, తాగుబోతులాంటిమారుపేర్లతో అయానను సంబోధిస్తున్నారు.

ఇంటా తండ్రి రాఘవయ్యగారు మాత్రం కడుపుమంటతో నాలుగుకేకలు వెయ్యటం అవి మోహన్ పెడచెవిన పెట్టటం జరిగిపోయింది. చెల్లెలు జ్యోతి కళ్ళనీళ్ళతో చెప్పింది తాగుడు మానుకొమ్మని. లాభంలేకపోయింది. మోహన్ ఎవ్వరినీ లెక్కచేయటం లేదు.

ఇన్ని జరుగుతున్నా రాధ మాత్రం నిశ్చలంగా వుంటుంది. మానసికంగా బాధపడుతోంది జ్యోతితో ఆలోచించి చిన్న ప్రాక్టికల్ చేస్తే ఈయన మార

[మిగతా 33 వ పేజీలో]

# ఫ్లక్షన్ అండ్ రియాక్షన్

[24 వ పేజీ తరువాయి]

తాగేమోననే నిశ్చయానికొచ్చింది.

* * *

ఆరోజు మోహన్ పెందరాళే ఇంటికి చేరుకొన్నాడు. తల్లిదండ్రి మధ్యహాల్లో కూర్చున్నారు. ఎదురుగా గడపగుమ్మంమీద రాధ కూర్చునివుంది జ్యోతి కాలేజీకి వెళ్ళినట్లుంది

రాఘవయ్యగారు మోహన్‌నుద్దేశించి "నువ్వు ఇంటిసంగతులేం పట్టించుకోవటంలేదు. పెళ్ళికి ఎదిగివున్న చెల్లెలొకటి వుందన్నసంగతే మరచిపోయేవు. దాన్నికూడ ఒకఅయ్యచేతిలోపెట్టానంటే నాబాధ్యత తీరిపోతుంది. తర్వాత ఎవరెట్లాపోతే నాకేం?' అని చెప్పారు.

"అలాగే సంబంధాలు చూస్తుండండి. మీ కిష్టమైతే నాకిష్టమే" అని అన్నాడు మోహన్.

'చూస్తూనే వున్నను. మొన్న ఆ విజయవాడ వాళ్ళొచ్చారు అన్నిపాస్తులవీ బాగానేవున్నాయి. తల్లి ఒక్కతేవుంది. ఇంటిబాధ్యతలన్నీ ఆ అబ్బాయివేనట. అగ్రికల్చరల్ బి యస్ సి, చదివాడు. జ్యోతికి ఈడూజోడు సరిపోతుంది. రేపు అమ్మాయిని చూసుకోవటానికి వస్తున్నామన్నారు వాళ్ళు నీకిష్టమేగా. రేపొక్కరోజు మాత్రం మామూలుగా వుండి, మన పరువు కాపాడు అతాగుడు రేపొక్కరోజు మానెయ్." అని హెచ్చరించారు.

తాగుడు మాటరాగానే ముఖం నల్లబడిపోయింది మోహన్‌కు. 'అలాగే! నా చెల్లికి ఏమివ్వలేకపోయినా ఈ మాత్రం సహాయం చెయ్యలేనా?" అంటూ గొణుగుతూ తన గదిలోకి వెళ్ళాడు మోహన్.

అప్పటివరకు ఈ మాటలన్నీ విన్న రాధ, భర్త వెనుక గదిలోకి వెళ్ళింది.

* * *

జ్యోతిని చూసుకోవటానికి సంబంధంవాళ్ళు వచ్చేరోజు రానే వచ్చింది ప్రొద్దున్నుండి ఇంటి బూజు దులిపించి,గుమ్మాలకు కిటికీలకు ఇస్త్రీ కర్టెన్లు కట్టాడు. జ్యోతి తల్లి వచ్చే బంధువులకు పిండి వంటలుచేసే కార్యక్రమంలో మునిగిపోయింది. రాఘవయ్యగారు బజారునుండి వక్కపొడి కిళ్ళీలు లాంటి వస్తువులను తెప్పిస్తున్నారు. మోహన్ హుషారుగా అందరికీ సహాయం చేస్తున్నాడు. ఇవన్నీ ముభావంగా జ్యోతి రాధ ఇరువురు గమనిస్తూనే వున్నారు.

మధ్యాహ్నం రెండు గంటలైంది. పెళ్ళి చూపుల వారు చిన్నకారులో వచ్చారు. వచ్చిన వారిని మోహన్ ఆహ్వానించి లోపలికెళ్ళి తల్లితో చెప్పి వచ్చాడు. కాబోయే బావమరిదితో మాట్లాడుతూ కూర్చున్నాడు.

అంతలో మధ్యవర్తి "అన్నయ్యగారు. త్వరగా అమ్మాయిని ప్రవేశ పెట్టండి మళ్ళీ వర్షంవస్తుంది." అని తొందర చేయసాగాడు.

రాధ రాకతో అందరూ ఒక్కసారి ఆశ్చర్యపోయారు. రాధ తూలుకొంటూ, తప్పటడుగులు వేస్తూ వచ్చిన అతిథులచుట్టూ ఒక్కసారి ప్రదక్షిణ చేసి రాఘవయ్యగారితో "ఏమండి మామగారు ఎవరికి పెళ్ళి. నాకేనా? నాకైతే వద్దు... అహా... కావాలి .. కావాలి," అంటూ ఎక్కిళ్ళుఎక్కుతూ మాట్లాడసాగింది. నోటిలోనుండి 'రమ్' వాసన రానాగింది మాటలు ముద్దగా వస్తున్నాయి.

అందరు విభ్రాంతులైపోయారు.

పెళ్ళికొడుకు దగ్గరకెళ్ళి "నీవు పెళ్ళికుమారుడివా? భలేగున్నావే. నన్ను పెళ్ళిచేసికొంటావా? వద్దుబాబూ నీవు సంపాదించేడబ్బులు నాతాగుడుకు చాలవు. ఫోరా ఫో, ఏమిటి ఆశ్చర్యపోతున్నావ్. గుర్రమెక్కానని? అది నాకలవాటే. తాగందే నేనుండలేను. తాగటం (స్టైల్.) తాగటం చేతకాని వాడు ఈ సొసైటీలో బతకలేడు." అని పిచ్చిగా మాట్లాడుతూ పెళ్ళికొడుకువెనక నిలబడింది.

పెళ్ళికొడుకు తండ్రి "ఎవరండి ఆ అమ్మాయి" అని ప్రశ్నించాడు.

మోహన్, రాఘవయ్యగారు తలలు వంచుకొన్నారు.

మధ్యవర్తి 'ఈ ఇంటి కోడలు" అనిచెప్పాడు.

'సరేలే! భలె సంబంధమే చూపించావ్. ఇంకా నయం ... చేసుకోక ముందే తెలిసింది. కాబట్టి సరిపోయింది ఇలాంటి తాగుబోతు వాళ్ళతోనా మేము వియ్యమందేది? ఛీ ఛీ ... అవ్వ అడది... ఇలా బరితెగించి..." అంటూ ఆయనమాట పూర్తి చేయకముందే రాధ,

'షటప్ తాగుతాను నా ఇష్టం. హూ ఆర్ యు ఆస్కింగ్ మీ? ఏం ఆడది తాగకూడదా? ఎక్కడుందా రూలు? ఒకవేళ ఫుంటే తీసికెళ్ళి బంగాళాఖాతంలో కలుపు నేను చేసేదితప్పని ఎవరంటారు, అన్నవాళ్ళ నాలుక తెగ్గోస్తాను నా భర్త తాగుతాడు నేను తాగుతాను భారతీయ సంస్కృతి ప్రకారం భర్త యే పని చేస్తే ఆ పని చేయాలి. అందుకే నా భర్త తాగుతాడు కాబట్టి నేనూ తాగుతాను పూర్వం భర్త కిష్టమైన పనులు చేస్తే పతివ్రతలన్నారు. నా భర్త అడుగు జాడలలో నడుస్తున్న నేను పతివ్రతను కాదని ఎవరంటారు? ఏమంటారు మామగారు!" అని రాఘవయ్యగారిని ప్రశ్నించింది రాధ,

వచ్చినవాళ్ళ "అవునమ్మా! పతివ్రతవే కాదని ఎవరంటారు, ఇంకానేవుంటే నాకూడ ఒక గుడి కట్టించమని అడిగినా అడుగుతావు ఇలాంటి కోడలున్నఇంటికా మేమువచ్చింది, ఖర్మ" అంటూ ఖండువా దులుపుకొని వెళ్ళిపోయారు.

షటప్ స్కౌండ్రల్. గెటవ్‌టు ఫ్రమ్ మై హౌస్ అని అరచి స్పృహ తప్పి పడిపోయినట్లుగా మోహన్ కాళ్ళ దగ్గర పడిపోయింది, వచ్చినవాళ్ళు గేటుదాటి వెళ్ళిపోయిన తర్వాత మోహన్‌లో చైతన్యం కల్గింది. ఉద్రేకంతో 'రాధా' అని గట్టిగా కేక వేశాడు. ఆ కేకకు బెదరిపోయి లేచి నుంచుంది రాధ.

అంతే.. రాధ చెంప ఛెళ్ళుమంది. రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నడుముకున్న బెల్టును విప్పదీసి రాధను తనిష్టంవచ్చినట్లు కొట్టసాగాడు. రాధ ఒంటిపై ఎర్రటి జీరలేర్పడ్డాయి. ఆ దెబ్బలధాటికి తట్టుకోలేక 'కొట్టకండి. అబ్బా ప్లీజ్. నా మాట నమ్మండి. నేను త్రాగలేదండి. అంటూనే ఆ దెబ్బలనుండి తప్పించుకోవాలని చూస్తుంది రాధ.

మోహన్ ఇదేం లెక్కచెయ్యడంలేదు. అంతలోనే జ్యోతి రాధ కడ్డంవచ్చింది. జ్యోతిని లాగి పారేశాడు మోహన్. దూరంగా పడిపోయిన జ్యోతిలేచి వచ్చి 'నిజం నామాట నమ్ము అన్నయ్యా. వదిన అసలు తాగలేదు. అలా నటించింది.' అని చెబుతున్నా వినకుండా మోహన్ రాధను కొడుతూనే జ్యోతితో 'జ్యోతి అడ్డు తప్పుకో, ఇవ్వాళ దాని అంతుచూస్తాను. దానికడ్డంవచ్చిన వాళ్ళగతికూడ అంతే. పతివ్రతట పతివ్రత'' అంటూ ఆవేశంతో వూగిపోసాగాడు.

జ్యోతి తండ్రితో ''నాన్నా! నేను నెమ్మదిగా అన్నీ చెపుతాను, అన్నయ్యను తీసుకెళ్ళు'' అని చెప్పింది.

రాఘవయ్యగారు మోహన్ చేతిలో బెల్టులాక్కుని ''ఏరా ఎందుకు కొడతావు' అది ఏం తప్పుచేసిందని. తప్పంతా నీదికాదు? ఏం నీవుతాగితేలేనితప్పు అదితాగితే వచ్చిందా? తప్పత్రాగి తండ్రి అనే గౌరవంకూడ లేకుండ నాముందరే తందనాలాడేవుగా, భార్యా, ఇల్లు, సంసారం అన్నీమరచిపోయి తప్పతాగి తూలుకొంటూ ఏ అర్ధరాత్రో ఇంటికి చేరుకొనేనీవు నీవొచ్చేదాక మెలకువతోవుండి నీ ఆరోగ్యంకోసం తన ఆరోగ్యం చెడకొట్టుకొనే రాధ, ఇవాళ ఏదో తాగిందని శిక్షిస్తున్నావా? ఇంటి బీరువాలనిండా సీసాల నలంకారంగా నింపి రోజూ వాటిని ఖాళీచేస్తూ ఖాళీ అయిన సీసాపెంకులతో నీభార్య గుండెలను రోజూ కోసే నీవే నా? రాధను శిక్షించేది. భర్త ఆదేవనిగా తాగుతున్నాడు. ఏంవుందో ఇందులోనని రుచిచూసొందొచ్చు. నీ భార్య తాగితే నీకభ్యంతరం అయినవాడివి ఆసీసాలను ఇంటో ఎందుకుంచాలి, ఇన్నాళ్ళుగా నీవు తాగుతుంటే ఒక్కనాడన్నా నీతో అతాగుడును మానమని చెప్పిందటరా? ఈనాడు సిగ్గులేక దానికి చెప్పేవాడివయావు.'' అని కోపంగా కేకలువేయసాగారు.

మోహన్ కొక్కసారి ఉద్రేకం చల్లబడిపోయింది ఆలోచనలు మనసును ముసురుకొన్నాయి. రాధనుగురించి మోహన్ ఇలా ఆలోచించసాగాడు. "రాధ ఇలా మారటానికి తనేకదా కారణం. ఇంతవరకు తాగవద్దని ఎన్నడూ చెప్పలేదు, అర్ధరాత్రి తనొచ్చేవరకు మెలకువగా వుండి తనకు కావలసిన సపర్యలు చేసిగాని నిదురపోయేది కాదు. తల్లి తండ్రీ, భార్య అనే గౌరవం లేకుండా తాగిన నేను ఈ నాడు నా భార్య, తాగిందని శిక్షించే అధికారం నాకులేదు. నా పతనానికి ఈ తాగుడే కారణం. ఇకమీదట తాగకూడదు. నా కోసం కాకపోయినా రాధ కోసమైనా మానెయ్యాలి." ఇలా ఆలోచించిన మోహన్ తనగదిలోకి వెళ్ళి బీరువాలోవున్న సీసాలు దొడ్లోకి గిరవాటేశాడు. అది చూసిన రాధకళ్ళు

మెరిశాయి. కన్నీటిని తుడుచుకొని లేచికూర్చుంది.

మోహన్ రాధ దగ్గరకువెళ్ళి నన్ను క్షమించు రాధా!' అని అడిగాడు.

రాధ మోహన్‌కాళ్ళను పెనవేసి "ఇకమీదట తాగనని నా తలమీద చేయివేసి చెప్పండి" అని అడిగింది రాధ చెప్పినట్లు చేశాడు మోహన్.

రాధ రాఘవయ్యగారితో "నన్ను క్షమించండి మామయ్యా. మీ ఇంటి పరువుప్రతిష్ఠలను నా స్వార్థంకోసం పరాయివ్యక్తులఎదుట పోగొట్టాను." అన్నది.

రాఘవయ్యగారేం మాట్లాడలేదు.

మోహన్‌మాత్రం "లేదురాధా మన పరువు ఇవాళ నలుగురుముందరే పోయింది ఇవాళ నీవిలా చేయకున్నట్టయితే రేపు నావల్ల పదిమందిఎదుట మనకు చెడ్డపేరొచ్చేది. ఎంతో మంచిపని చేశావు నీవు అయినా నా కనుమానం నిజంగా, నీవు తాగావా?" అని ప్రశ్నించాడు.

"లేదన్నయ్యా! అంతాఒట్టిదే ఇదంతా మేమిద్దరంకలసి ఆడిన నాటకమిది. నీవు తాగి చెడిపోతున్నావని వదిన ఎంతో బాధపడేది. నీలో ఎలా మార్పు తీసుకురావాలా అని ఆలోచించింది. తాగేవాళ్ళకి తాగొద్దని మంచిగాచెబితే వినిపించుకోరు ప్రాక్టికల్‌గా చేసి చూపాలి భర్తతాగినా భార్య సహిస్తుంది అదే భార్యతాగితే భర్త సహించలేడు. భార్య తాగుతుందని తెలిస్తే తనను సంఘం హేళనగా చూస్తుందని భయం. అందుకైనా తను తాగుడు మానేస్తాడు. అలాగని చెప్పి ఇలా చేసింది. ఇకపోతే తాగుడు వాసన ఎలా వచ్చిందంటావా? వున్నాయిగా ఇంట్లో మీ ఖాళీ సీసాలు. సీసాలోది నోటిలో పుక్కిలిపట్టి కొత్త బట్టలకు పులుముకొంది. ఎలాగైనా తన సంసారాన్ని నిలుపుకొంది. వచ్చిన వాళ్ళు ముడుచుకున్నారు, నటించటమంటావా? చదువుకొనే రోజులో కాలేజీల్లో నాటకాల్లో ఏమన్నా నటించిందేమో లేకపోతే వాళ్ళ వంశానికి తాగే అలవాటుందేమో అని నవ్వుతూ చెప్పింది జ్యోతి.

'అహా! అలాగా, అందుకని కాబోలమ్మా ఈ తాగుబోతువాళ్ళ సంబంధం కావాలని కళ్ళనీళ్ళు పెట్టుకున్నావ్" అంది రాధ

"సంబంధమేమిటి?" అని ప్రశ్నించారు అందరూ ఒక్కసారి

రాధ నెమ్మదిగా అసలు విషయం చెప్పసాగింది.

"జ్యోతికివాళవచ్చినసంబంధం ఇష్టంకాలేదు'. అందుకే నిన్న నా దగ్గరకు వచ్చి తనకీ సంబంధమిష్టంలేదనీ, మీ తమ్ముడు కృష్ణను తప్ప ఇంకెవరును పెళ్ళి చేసుకోనని చెప్పింది, సరే! ఎలాగు ఈ సంబంధం చెడిపోతుంది. నా సంసారం బాగుపడుతుందని ఇలా నటించాను. మామయ్యగారు మా కృష్ణ కూడా మీ జ్యోతినే చేసుకుంటానంటున్నాడు మాతరపున మా కిష్టమే, మీ కిష్టమైతే ముహూర్తాలు పెట్టుకోవచ్చుని మా నాన్నగారు ఉత్తరం రాశారు" అని చెప్పింది.

రాఘవయ్యగారు 'సరే దానికిష్టమైతే మాదేముంది శుభస్య శీఘ్రం' అన్నాడు.

జ్యోతి సిగ్గుతోలోపలకెళ్ళిపోతోతుంటే మోహన్ 'చెల్లాయ్ జాగ్రత్త తాగి కూడ భయపెట్టలేని వాళ్ళం మనం. వాళ్ళు తాగినట్లు నటించి గుండెలదరకొడతారు, ఎలా వేగుతావో మరి.' అని హాస్యమాడాడు.

జ్యోతి సిగ్గుతో ముడుచుకుపోయింది,

రాధ మోహన్ వెక్కిరించుతూ 'యాక్షన్ మేక్స్ ఎ గుడ్ రియాక్షన్' అన్నది.

★

# ఆడవారు - అందము

## — కుమారి మద్దాలి కృష్ణకుమారి

అందము అనేది ఆడవారి సొత్తు. అలంకరణ అనేది ఆడవారికే ఎక్కువ అవసరము. వనితలు శుభముగా, అందముగా వుంటే గృహమునకే అందము వచ్చును భార్యలు అందముగా వుంటే వారి భర్తలకు ఆనంద దాయకము కాలేజి అమ్మాయిలు అందముగా వుంటే కాలేజీకి అందము వస్తుంది. మనుష్యులు రకరకములుగా వుంటారు కొందరు తెల్లగా, మరికొందరు నల్లరూపున కొందరు పొట్టిగా లావుగా కొందరు సన్నగా పొడవుగా వుంటారు. దానికి ఎవరు ఏమి చేయలేరు. చేయవలసినదంత ఉన్న అందమును పెంపొందించు కోవాలి

ఆడవారికి అందము నిచ్చునది అలంకరణ ఈ అలంకరణ అనేది పలురకములు. ముందుగా కేశాలంకరణ తీసికొందాము కాలేజి అమ్మాయిలకు పొడవాటి వాలు జడ లేక రెండు జడలు కాని బాగుంటాయి కాని ముడులు బాగుండవు కాని యీ అమ్మాయిలే వెర్రి మొర్రి ఫాషనులు నేర్చుకొని వున్న కేశము కత్తిరించి కురచజడలుగా మార్చుకొను చున్నారు. లేకపోతే కేశములు కత్తిరించి ఫాల భాగము కన్పించకుండా కప్పివేసికొనె వారు కొందరు. మరి నడివయస్సు స్త్రీలు కొందరు వాలుజడలువేసికొనితయారుఅవుతారు. వారికిఅక్కడక్కడ తెల్ల వెంట్రుకలు కన్పించినను లెక్క చేయరు. వనితలకు ఇద్దరు, ముగ్గురు పిల్లలు పుట్టిన తరువాత వారికి వాలుజెడలు అందము నివ్వవు, అటువంటి వారు చక్కగా ముడి చుట్టుకొంటె వాళ్ళనుచూసిన వారికి గౌరవ భావము కలుగుతుంది.




ఆడవారి మరియొక ముఖ్య అలంకరణ వస్త్రాలంకరణ. వనితలు బట్టలు కొనుక్కునే టప్పుడే శ్రద్ధ వహించ వలయును, తెల్లని, పసిమి రంగుగల వారికి కొంచెము ముదురు రంగులైనను అందము నిస్తాయి కాని నల్లరూపు గాని, చామన ఛాయగల వారికి లేత రంగులే బాగుంటాయి. వారు ముదురు రంగులు వేసికొంటె అందము నివ్వవు. కొంచెము పొట్టిగా లావుగా వున్నవారు చీరలు బాగా క్రిందకి కడితే పొడవుగా కన్పిస్తారు. వీరు చెన్నే చీరెలు కట్టకుండా నేత, వాయిల్ చీరెలు కడితె సన్నగా కన్పిస్తారు పొడవుగా సన్నగా వున్నవారికి టెర్లిన్ లేక నైలెక్స్ చీరలైతే కొంచెము లావుగా కనబడతారు. ఈ నైలెక్స్ చీరెలు పాతికసంవత్సరములలోపు వారికే బాగుంటాయి కానినడివయస్సువారు కడితె ఏమిటో చుట్ట బెట్టినట్లు వుంటుంది. నలుబది ఏళ్ళపైనవారికి జరీచీరెలుగాని, ఎట్టచీరెలుగాని అందమునిస్తాయి, పెద్దపెద్ద పూలచీరలుకాని, డిజైన్‌చీరెలుగాని పాతిక సంవత్సరముల లోపువారికే బాగుంటాయి. యింకా ఆపైనవారికి సాదాచీరెలు బాగుంటాయి. ఏచీరెలైన పొదుపుగా కట్టుకొని. శుభ్రముగా వుంచుకొంటె బాగుంటుంది

మరియొక అలంకరణ బొట్టు, కాటుక. కొందరు విద్యార్థినిలు బొట్టు పెట్టుకోకుండా వుంటే ఫాషన్‌గా తలంచుతారు ఆడవారి అందమంతా బొట్టు, కాటుకలతోనె ప్రకాశించుతుంది చిన్నవారికి పొడుగు బొట్టయిన, గుండ్రముదైన బాగుంటుంది పెద్దవారికి సామాన్యముగా గుండ్రనిబొట్టు అందమునిస్తుంది. పౌడర్ కనిపించకుండా రాచుకొంటెనె బాగుంటుంది. కాని కోటింగ్ కొట్టినట్లు వుంటె వున్న అందమునకు వంకర వస్తుంది.

ఆడవారు నవ్వుతూవుంటే వారిలో లేనిఅందము ప్రకాశించుచు కన్పించును. ఆడవారి మోము ఎప్పుడు చిరునవ్వులుచిందుతూవుండాలి.కాని విరగబడి నవ్వకూడదు.

వివాహానంతరము స్త్రీలకు సామాన్యముగా అలంకరణపై శ్రద్ధ తగ్గిపోతుంది, ఆ విధంగా కాక గృహిణులు ఉన్నంతలోనె అలంకరించుకొని వారి వారి గృహమునకే అందం చిందించవలయును. వారి భర్తలకు తృప్తిని కల్గించవలయును. కాని ఇంట్లోనె కదా చింపిరిగా ఉండరాదు. పిల్లలు కలవారు పిల్లల పోషణలో మరింత శ్రద్ధవహించవలయును. "ఇంటిని చూచి యింటి ఇల్లాలిని చూడాలి" అనువారికి సద్భావము కల్గించవయును.

ఆడవారు అందముగా వుండటం అంటె సినిమా హీరోయిన్ల మాదిరి అలంకరించుకోవటం కాదు, ఉన్నంతలోనె తృప్తిగా, ఏవయస్సుకు తగ్గ అలంకరణ ఆవయస్సుకు తగునట్లుగా చేసికొని, చిరునవ్వుతో జీవించి జన్మనుసార్థకత చేసికొనవయును. కాని వేదాంత ధోరణిలో వుండరాదు. అందము ఆకర్షణ ఆడవారి సొత్తు. కాబట్టి దానికి మెరుగులు దిద్దుకొన వలయునని నా అభిప్రాయము

★